# సమసమాజ నిర్మాణమే కేసీఆర్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మహమూద్ అలీ. వేదికపై మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

- **కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఒక్కటే**
- **మంత్రి మహమూద్ అలీ**
- **సెక్యులర్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలి**
- **కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల**
- **కరీంనగర్‌లో ముస్లింల ఆత్మీయ సమ్మేళనానికి హాజరు**

కార్పొరేషన్, నవంబర్ 13: మతకల్లోలాలు లేని సమసమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర మంత్రి మహమూద్ అలీ అన్నారు. ఆదివారం హుస్సేన్‌పుర నేషనల్ ప్యాలెస్‌లో ముస్లింల ఆత్మీయ సమ్మేళనానికి మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం అన్ని మతాలు, వర్గాలను సమానంగా చూస్తూ వారి సంక్షేమం కోసం పని చేస్తున్నదన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం గత 70 ఏళ్లలో ఏ ప్రభుత్వాలు చేపట్టని పథకాలను బీఆర్ఎస్ సర్కారు తీసుకువచ్చిందన్నారు. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు ఒక్కటేనని, ఎన్నికల్లో ఒకరి గెలుపు కోసం ఒకరు పని చేస్తున్నారని విమర్శించారు. కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, సమైక్య పాలనలో ఎక్కడ చూసినా గొడవలు, శాంతిభద్రతల సమస్యలు, 144 సెక్షన్‌లు, లాఠీచార్జీలు ఉండేవన్నారు. రాజకీయ అవసరాల కోసం హిందూ ముస్లింల మధ్య గొడవలు పెట్టి లబ్ధి పొందేవారని విమర్శించారు. బయటకు వెళ్లిన పిల్లలు ఇంటికి వచ్చేవరకు తల్లిదండ్రులు భయంభయంగా గడిపేవారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత హిందూ ముస్లింలు ఒక్కటై కలిసిమెలిసి జీవిస్తున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో కడుపునిండా తిని కంటి నిండా నిద్రపోతున్నారని గుర్తు చేశారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నప్పుడే పెద్దపెద్ద కంపెనీలో తరలివస్తాయని, దీంతో మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. రానున్న ఎన్నికల్లో సెక్యులర్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాలన్నారు. తెచ్చుకున్న తెలంగాణ కేసీఆర్ చేతుల్లోనే భద్రంగా ఉంటుందన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మితే తెలంగాణ సంపదను దోచుకుంటారని తెలిపారు. పదేళ్లలో జరిగిన నగరాభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ, మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. మైనార్టీల కోసం అత్యధికంగా నిధులు కేటాయించి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అన్ని వర్గాల సమానంగా చూస్తున్న కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయాలని కోరారు. సమావేశంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్, బీఆర్ఎస్ నాయకులు అక్బర్‌హుస్సేన్, అమ్జద్ అలీ, షౌకత్, బాజ్ జానీ, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష మందితో ప్రజా ఆశీర్వాద సభ



సీఎం సభ కోసం డిగ్రీ కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, తదితరులు

- **ఈ నెల 17న ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహణ**
- **హాజరు కానున్న సీఎం కేసీఆర్**
- **బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు తరలిరావాలి**
- **బీఆర్ఎస్ హుజూరాబాద్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి**
- **సభ కోసం కళాశాల క్రీడా మైదానం పరిశీలన**

జమ్మికుంట, నవంబర్ 13: జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో లక్ష మందితో ప్రజా ఆశీర్వాద సభను నిర్వహిస్తున్నామని, ఈ నెల 17న జరిగే సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరవుతారని బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. సీఎం సభ కోసం కళాశాల మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సోమవారం పాడి కౌశిక్‌రెడ్డి జమ్మికుంటకు వచ్చారు. కళాశాల క్రీడా మైదానాన్ని సందర్శించారు. సభాస్థలిని పరిశీలించారు. సభా ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, సభకు హాజరయ్యే ప్రజల రూట్ మ్యాప్, తదితర అంశాలను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులతో చర్చించారు. అనంతరం మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ సభ కనీవిని ఎరుగని తరహాలో నిర్వహించేందుకు ప్రణాళిక తయారు చేశామని, సభకు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లక్ష మంది కోసం తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, వాహనాలు నిర్దేశించిన స్థలాల్లోనే పార్కింగ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్టేజీ వద్ద అతిథులు, వీఐపీలు, మీడియా ప్రతినిధులు, తదితరుల కోసం ప్రత్యేక గ్యాలరీలు కేటాయించనున్నట్లు వెల్లడించారు. అనంతరం సీఎం సభకు వచ్చే రూట్‌ను చూశారు. తర్వాత నాయిని చెరువు వద్దకు వెళ్లారు. హెలీప్యాడ్‌ను పరిశీలించారు. ఆయన వెంట బీఆర్ఎస్ అర్బన్‌పార్టీ అధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, డీసీసీబీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు వాలా బాలకిషన్‌రావు, పోల్నేని సత్యనారాయణరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ పోడేటి రామస్వామి, పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

### హెలీప్యాడ్, సీఎం సభాస్థలాన్ని పరిశీలించిన ఏసీపీ

ఈ నెల 17న సీఎం జమ్మికుంటకు రానున్న సందర్భంగా జమ్మికుంట టౌన్, రూరల్ సీఐలు రమేశ్, కిశోర్‌కుమార్‌తో కలిసి హుజూరాబాద్ ఏసీపీ ఎల్ జీవన్‌రెడ్డి నాయిని చెరువు వద్దగల హెలీప్యాడ్, సీఎం సభాస్థలాన్ని పరిశీలించారు. హెలీప్యాడ్ నుంచి సభాస్థలి వరకు సీఎం వచ్చే వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సీఐలకు సూచించారు. సభావేదిక, గేట్లు, రూట్‌మ్యాప్‌లు, వాహనాల పార్కింగ్, తదితర అంశాలపై చర్చించారు. తగు సలహాలు, సూచనలు అందించారు. ఇక్కడ సీఐలతో పాటు సిబ్బంది ఉన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లిపై ఫిర్యాదు



సీపీకి ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

మానకొండూర్, నవంబర్ 13: డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దాఖలు చేసిన నామినేషన్ అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఉందని రిటర్నింగ్ అధికారికి ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదు చేసి సోషల్ మీడియాలో రసమయి నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించినట్లు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించిన కవ్వంపల్లిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇక్కడ జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, నాయకులు గంట మహిపాల్, దేవ సతీష్‌రెడ్డి, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, ఉండింటి శ్యాంసన్, పిట్టల మధు తదితరులు ఉన్నారు.



తపాలా శాఖ అధికారులు, ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

# ఎపిక్ కార్డులు త్వరగా పంపిణీ చేయాలి

- **జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి**

కలెక్టరేట్, నవంబర్ 13: జిల్లాలో ఇప్పటి వరకు పంపిణీ చేయకుండా మిగిలిపోయిన ఎపిక్ కార్డులు త్వరగా, ఓటర్లకు చేరేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో ఎపిక్ కార్డుల పంపిణీపై తపాలా శాఖ అధికారులు, ఎన్నికల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, జిల్లాలో ఎపిక్‌కార్డులు పెండింగ్‌లో ఉంటే, వాటిని సొంతదారులకు వెంటనే అందజేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో పవన్‌కుమార్, పోస్టల్ సూపరింటెండెంట్ శివాజీ, సునీల్‌కుమార్, పోస్ట్‌మాస్టర్ పవన్‌కుమార్, ఎన్నికల విభాగం సిబ్బంది కాళీచరణ్, తహసీన్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకుని, వందశాతం పోలింగ్ నమోదుకు సహకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై రూపొందించిన పలు రకాల గోడప్రతులను సోమవారం ఆమె తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓట్లు వేయాలన్నారు. గోడప్రతులు ఆవిష్కరించినవారిలో సాగర్, మునిగోపాల్, రాఘవేందర్, రవితేజ, తదితరులున్నారు.

### జిల్లా ఇంటలీజెన్స్ కమిటీ ఏర్పాటు

ఎన్నికల్లో అభ్యర్థులు ఇష్టారాజ్యంగా చేసే ఖర్చును కట్టడి చేసేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నది. వీటిని అమలు చేసేందుకు జిల్లాల వారీగా ఇంటలీజెన్స్ కమిటీలు కూడా ఏర్పాటు చేసి, ఆయా పార్టీలు, అభ్యర్థులు గతంలో చేసిన ఖర్చులను కూడా బేరీజు వేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలో కూడా ప్రత్యేకంగా కమిటీ నియమించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి నేతృత్వంలో ఈ కమిటీకి రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి మాట్లాడుతూ, పోలింగ్ జరిగేవరకు ఎప్పటికప్పుడు ఈసి నిర్దేశించిన సూచనలు పాటిస్తూ, నివేదికలు తయారు చేయాలన్నారు. ఖర్చులపై రిపోర్టులు రూపొందించటం నిరంతర ప్రక్రియగా భావించాలన్నారు. ఈ కమిటీలో ప్రొహిబీషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పీ శ్రీనివాసరావు, ఆదాయ పన్ను శాఖ అధికారి సుబ్బారెడ్డి, జీఎస్టీ జాయింట్ కమిషనర్ సిహెచ్.రవికుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు సభ్యులుగా ఉంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్ తిరుమల్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన మేయర్

- **ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో సీఎం సభకు ఏర్పాట్లు**
- **యూనివర్సిటీలో హెలీప్యాడ్**

కార్పొరేషన్, నవంబర్ 13: కరీంనగర్‌లో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 17న సీఎం కేసీఆర్ హాజరయ్యే ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు సోమవారం పరిశీలించారు. బీఆర్ఎస్ నాయకులు చల్ల హరిశంకర్, నందెల్లి మహిపాల్‌తో కలిసి ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. అలాగే శాతవాహన యూనివర్సిటీలో సీఎం కేసీఆర్ హెలిప్యాడ్ ఏర్పాటు చేయనుండగా, అక్కడ నుంచి ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానానికి వచ్చే రోడ్డు పరిస్థితులపై సమాలోచనలు చేశారు. ప్రజా ఆశీర్వాద సభకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు వచ్చే ప్రజలకు ఎక్కడా ఇబ్బంది కలుగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ వై.సునీల్‌రావు తెలిపారు. మహిళలు, పురుషులు, యువత కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే వచ్చే ప్రజలకు వాహనాల పార్కింగ్‌లో ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా మంచినీటి సరఫరా విషయంలోనూ ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు చెప్పారు. నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చే ప్రజలకు సమస్యలు, ఇబ్బందులు రాకుండా ఈ సభకు విజయవంతం కోసం తగిన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. వచ్చే ప్రజలకు ఎండతో ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కర్ర రాజశేఖర్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఎస్ఆర్ఆర్ కళాశాల మైదానంలో సీఎం కేసీఆర్ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు, నాయకుడు చల్ల హరిశంకర్